నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | గురువారం 11 జనవరి 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

ఎంసీహెచ్‌లో ప్రసవాలు పెంచాలి

వైద్య, ఆరోగ్యశాఖ కమిషనర్ కర్ణన్

ఎంసీహెచ్‌లో ఆశలతో మాట్లాడుతున్న ఆర్వీ కర్ణన్

మంచిర్యాల ఏసీసీ, జనవరి 10: మాతా శిశు ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్యను పెంచాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ కమిషనర్ ఆర్వీ కర్ణన్ అన్నారు. కాలేజ్‌రోడ్డులోని మాతా శిశు సంరక్షణ దవాఖానను కలెక్టర్ సంతోష్, అదనపు కలెక్టర్ బీ.రాహుల్, డీఎంహెచ్‌వో జీ సుబ్బారాయుడితో కలిసి బుధవారం తనిఖీ చేశారు. ఎంసీహెచ్‌లో ప్రసవాలు తక్కువేందుకు జరుగుతున్నాయని ప్రశ్నించారు. గత నెల ప్రసవాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ ఎంసీహెచ్ ఉండగా, కరీంనగర్‌కు కేసులు ఎందుకు పంపుతున్నారని ప్రశ్నించారు. 300 పడకల ప్రభుత్వ దవాఖాన భవన పనులను పరిశీలించి, త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. దవాఖాన సూపరింటెండెంట్ డా.హరీశ్ చంద్రా రెడ్డి, ఆర్ ఎంవో డా.భీష్మా, సూపరింటెండెంట్ డా.వేదవ్యాస్, డీఎస్‌వో డా.ఫయాజ్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆడపిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

కలెక్టర్ హేమంత్ బోర్కడే, ఎమ్మెల్యే హరీశ్‌బాబు

వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్

దహెగాం,జనవరి 10: ఆడపిల్లల ఆరోగ్యంపై కేంద్రం ప్రత్యేక దృష్టి పెట్టిందని కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ హేమంత్ బోర్కడే, ఎమ్మెల్యే పాల్యాయి హరీశ్‌బాబు అన్నారు. భేటీ బచావో– భేటీ పడావో కార్యక్రమంలో భాగంగా స్థానిక కేజీబీవీలో విద్యార్థినుల కోసం ఏర్పాటు చేసిన ఆరోగ్య పరీక్షల శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరోగ్యకరమైన అహారపు అలవాట్లతో పాటు మంచి నిద్ర, రోజుకు కొంత సమయం వ్యాయామం చేయాలని, ఆటలాడాలని సూచించారు. తహసీల్దార్ కల్పన, ఎంపీడీవో రాజేశ్వర్‌గౌడ్, డీఎంహెచ్‌వో తుకారాం, డిప్యూటీ డీఎంహెచ్‌వో నీతారాంనాయక్, వైద్యులు స్పందన, సురేందర్, ఎస్వో రిజ్వానా, తదితరులున్నారు.

ఆరోగ్యానికీ ప్రాధాన్యమివ్వాలి

ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, జనవరి 10: విద్యార్థులు చదువుతో పాటు ఆరోగ్యానికీ ప్రాధాన్యమివ్వాలని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి సూచించారు. జిల్లా కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో బుధవారం నిర్వహించిన భేటీ బచావో భేటీ పడావో కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన మెగా వైద్య శిబిరాన్ని అదనపు కలెక్టర్ దీపక్ తివారీతో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇలాంటి వైద్య శిబిరాలు ఆరోగ్య లోపాలను తెలుసుకోవడానికి ఉపయోగపడతాయని పేర్కొన్నారు. అదనపు కలెక్టర్ దీపక్ తివారీ మాట్లాడుతూ విద్యార్థులు మానసిక, శారీరక ఆరోగ్యాన్ని కలిగి ఉన్నప్పుడే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని పేర్కొన్నారు. వారికి అందిస్తున్న పౌష్టికాహారం గురించి అడిగి తెలుసుకున్నారు. జడ్పీటీసీ అరిగెల నాగేశ్వరరావు, ఎంపీపీ అరిగెల మల్లికార్జున్, డీఈవో పార్థి అశోక్, సింగిల్ విండో చైర్మన్ అలి బిన్, ఎంపీడీవో శశికళ, ఎంపీవో ప్రసాద్, అహ్మద్, జిల్లా సైన్స్ అధికారి మధుకర్, అదనపు డీఎంహెచ్‌వో సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి, అదనపు కలెక్టర్ దీపక్ తివారి

జాతీయ స్థాయి పోటీలకు మంచిర్యాల విద్యార్థులు

మంచిర్యాల అర్బన్, జనవరి 10: యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఇటీవల నిర్వహించిన రాష్ట్ర స్థాయి యువజనోత్సవ పోటీల్లో జిల్లా కళాకారులు ప్రతిభ చూపారు. వీరు జాతీయ స్థాయి యువజనోత్సవ పోటీలకు ఎంపికయ్యారు. పట్టణంలోని మోడల్ స్కూల్ విద్యార్థులు రజిని కల్చరల్ ఫౌండేషన్ పేరిట గ్రూప్ ఫోక్ డ్యాన్స్‌లో మొదటి స్థానంలో నిలిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కొండ అశ్విత, కొమ్ముల కీర్తన, దెబ్బటి అశ్విత, చెలిమిల్ల ఆశిత, గోనె మేఘన, రొడ్డ అశ్లేష, కల్లెం అర్పిత, ఆదిమూలం భార్గవి, మెరుగు సాత్విక్, మహ్మద్ ఇర్ఫాన్ ఆలీని కలెక్టర్ సంతోష్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ నెల 12 నుంచి 16వ తేదీ వరకు మహారాష్ట్రలోని నాసిక్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు బుధ వారం ప్రత్యేక వాహనంలో వీరంతా తరలివెళ్లారు. డీవైఎస్‌వో శ్రీకాంత్ రెడ్డి జెండా ఊపి వాహనాన్ని ప్రారంభించారు. పాఠశాల ప్రిన్సిపాల్ రజని, అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్ సంతోష్

గంగాపూర్ జాతరకు ఏర్పాట్లు చేయండి

- కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు
- ఆలయానికి వెళ్లే దారుల పరిశీలన

రెబ్బెన, జనవరి 10: మండలంలోని గంగాపూర్ శివారులో కొలువైన శ్రీ బాలాజీ వేంకటేశ్వర స్వామి జాతరకు పూర్తి ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు సంబంధిత అధికారులకు సూచించారు. మండల కేంద్రంలోని గంగాపూర్ ఆర్చ్ ప్రాంతం, గంగాపూర్ గేట్ రోడ్, ప్రత్యామ్నాయ మార్గాలను పరిశీలించారు. వాహనాల రాకపోకలకు సంబంధించి ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. డీసీసీ అధ్యక్షుడువిశ్వప్రసాద్‌రావు, రెబ్బెన జడ్పీటీసీ వేముర్ల సంతోష్, ఎంపీడీవో పరికిపండ్ల శ్రీనివాస్, తహసీల్దార్ సమీర్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు లావుడ్య రమేశ్, కాంగ్రెస్ బ్లాక్ అధ్యక్షుడు దుర్గం దేవాజీ, గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు మోడెం సుదర్శన్‌గౌడ్, నాయకులు నవీన్‌జైస్వాల్, మోడెం రాజాగౌడ్, జుమ్మిడి ఆనందరావు, వెంకటేశ్వర్‌గౌడ్, ఉమేశ్, శ్రీనివాస్ ఉన్నారు.


రెబ్బెన లో గంగాపూర్ ఆలయానికి వెళ్లే దారులను పరిశీలిస్తున్న కలెక్టర్ బోర్కడే హేమంత్

గెలుపోటములు సమానంగా తీసుకోవాలి

గుడిపేట 13వ బెటాలియన్ కమాండెంట్ జమీల్ బాషా

క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న కమాండెంట్, అడిషనల్ కమాండెంట్ రఘునాథ్ చౌహాన్

హాజీపూర్, జనవరి 10: క్రీడాకారులు గెలుపోటములను సమానంగా తీసుకోవాలని గుడిపేట 13వ ప్రత్యేక తెలంగాణ పోలీస్ బెటాలియన్ కమాండెంట్ జమీల్ బాషా అన్నారు. మండలంలోని గుడిపేట గ్రామానికి చెందిన రాసమల్ల అశోక్ గౌడ్ జ్ఞాపకార్థం స్నేహితులు గుడిపేటలో బుధవారం ఏర్పాటు చేసిన మండల స్థాయి క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కమాండెంట్ మాట్లాడుతూ క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందన్నారు. నిర్వాహకులు మాట్లాడుతూ ఈ పోటీలను నాలుగు రోజుల పాటు నిర్వహిస్తామని, మొత్తం 14 జట్లు పాల్గొంటున్నాయని తెలిపారు. మొదటి బహుమతి రూ. 20 వేలు, ట్రోఫీ, ద్వితీయ బహుమతి రూ. 10వేలతో పాటు ట్రోఫీని అందజేస్తామన్నారు. అడిషనల్ కమాండెంట్ బౌలింగ్ చేయగా కమాండెంట్ బ్యాటింగ్ చేసి పోటీలను ప్రారంభించారు. గుడిపేట బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ రఘునాథ్ చౌహాన్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు తోట రవి, స్థానిక ఎంపీటీసీ ఒడ్డె బాలరాజు, అశోక్ గౌడ్, కుటుంబ సభ్యులు శ్రీనివాస్ గౌడ్, రవి గౌడ్, నాయకులు వొడ్డె శ్రీనివాస్, లగిశెట్టి రాజయ్య, బేర పోచయ్య, దొమ్మటి బాపు, మాజీ సర్పంచ్ దొమ్మటి లచ్చన్న, కందుల రమేశ్, ఒడ్డె శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పండుగ పూట పరేషాన్

ఎంఎల్‌సీ పాయింట్‌లో రేషన్ బియ్యం బస్తాలు

సంక్రాంతికి అందని రేషన్ బియ్యం

- పది రోజులు గడుస్తున్నా సగం దుకాణాలకే సరఫరా
- చౌకధరల దుకాణాల చుట్టూ తిరుగుతున్న కార్డుదారులు
- రేపు, మాపు అంటూ చెబుతున్న రేషన్ దుకాణాదారులు
- బియ్యం లేక ఖాళీగా దర్శనమిస్తున్న ఎంఎల్ఎస్ పాయింట్లు
- రైస్ రవాణాపై లారీ యజమానుల సమ్మె ప్రభావం కూడా కారణం

మంచిర్యాల, జనవరి 10(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : సంక్రాంతి పండుగ పూట రేషన్ దుకాణాలకు బియ్యం రాకపోవడంతో ప్రజలకు సరఫరా ఆలస్యం అవుతున్నది. పిండి వంటలకు బియ్యం అవసరం కావడంతో రేషన్‌కార్డుదారులు చౌక ధరల దుకాణాల చుట్టూ తిరుగుతున్నారు. సాధారణంగా ప్రతినెలా 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు రేషన్ బియ్యం లబ్ధిదారులకు అందించాలి. ఇందుకోసం ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి ముందుగానే బియ్యం రేషన్ షాపుల్లోకి చేరుకోవాలి. డిసెంబర్ 31వ తేదీలోగా రావాల్సిన బియ్యం పది రోజులు గడుస్తున్నా రాలేదు. ఉమ్మడి జిల్లాలో సగం రేషన్ షాపులకు మాత్రమే బియ్యం వచ్చాయి. మిగిలిన వాటికి రాలేదు. బియ్యం కోసం అధికారులను అడిగినా, ఎంఎల్ఎస్ పాయింట్‌కు వెళ్లినా.. ప్రయోజనం లేదని రేషన్ డీలర్లు వాపోతున్నారు. ఆదిలాబాద్, నిర్మల్, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో ప్రస్తుతం పంపిణీ ప్రక్రియ నడుస్తున్నది. మొన్నటి వరకు రేషన్ బియ్యం అందలేదు. ఇప్పుడు అన్ని షాపులకు సరఫరా చేస్తున్నట్లు అధికారులు చెప్తున్నారు. మంచిర్యాల జిల్లాలో సగం రేషన్ దుకాణాలకు మాత్రమే బియ్యం చేరాయి. పదో తేదీ ముగిసినప్పటికీ రేషన్ రాకపోవడంతో జనం అవస్థలు పడుతున్నారు. సంకాంత్రి పండుగకు పిండి వంటలు చేసుకునేందుకు బియ్యం కోసమని వెళ్తే లేవని చెప్తుండడంతో ఏం చేయలేక ఖాళీ చేతులతో వెనుదిరుగుతున్నారు.

ఎంఎల్ ఎస్ పాయింట్లకు నిలిచిన సరఫరా..

ప్రభుత్వం రేషన్ దుకాణాలకు ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి పంపించాల్సిన రేషన్ బియ్యం మూమెంట్ ఆలస్యమైంది. ఎంఎల్ఎస్ పాయింట్లలో బియ్యం సకాలంలో రాలేదని, అందుకే రేషన్ దుకాణాలకు అందలేదని తెలుస్తున్నది. ఈ నెలకు సంబంధించిన బియ్యం రిలీజింగ్ ఆర్డర్(ఆర్‌వో) కూడా లేట్ అయ్యింది. జనవరి నెలకు సంబంధించిన ఆర్‌వో డిసెంబర్ 20వ తేదీలోపు రావాల్సి ఉండగా, నెలాఖరున రిలీజింగ్ ఇవ్వడంతో మూమెంట్ ప్రక్రియ వెనుకబడింది. మరోవైపు లారీల యాజమాన్యాలు సమ్మెలో ఉండడం కూడా బియ్యం రవాణాపై తీవ్రమైన ప్రభావాన్ని చూపుతున్నది. బియ్యం సరఫరా చేసేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నప్పటికీ లారీల కొరత వేధిస్తున్నది. మంచిర్యాల జిల్లాలో 423 రేషన్ దుకాణాలున్నాయి. వీటిలో 240 దుకాణాలకు సరఫరా పూర్తయ్యింది. మంచిర్యాలలోని ఎంఎల్ఎస్ పాయింట్ పరిధిలో 142 రేషన్ దుకాణాలు ఉండగా 65 రేషన్ షాపులకు, తాండూర్‌లో 42 దుకాణాలకు 28, లక్షెట్టిపేట 81 దుకాణాలకు 32, బెల్లంపల్లిలో 72 దుకాణాలకు 57, చెన్నూర్‌లో 52 దుకాణాలకు 35, కోటపల్లిలో 34 దుకాణాలకు 23 షాపులకు పూర్తి స్థాయిలో బియ్యం సరఫరా అయ్యాయి.

లారీలు వచ్చిన కొద్ది పంపిస్తున్నాం..

మా ఎంఎల్ఎస్ పాయింట్ పరిధిలో 142 రేషన్ దుకాణాలు ఉన్నాయి.ఈ రోజు వరకు 65 దుకాణాలకు బియ్యం సరఫరా చేయడం పూర్తయ్యింది. ఈ రోజు రెండు లారీలు వస్తే రెండింటినీ లోడ్ చేసి పంపాం. లారీలు వచ్చినకొద్ది ఏ డీలర్ వస్తే వారికి బియ్యం లోడ్ చేసి పంపిస్తున్నాం. ఈ నెల మొదటి నుంచి మూమెంట్ ఆలస్యమైంది. రేషన్ బియ్యం మాత్రం కొంత ఆలస్యమైంది. *- శంకర్, ఎంఎల్ఎస్ పాయింట్ ఇన్‌చార్జి, మంచిర్యాల.*

బియ్యం పోస్తలేరు..

మందమర్రి, జనవరి 10: సంక్రాంతి పండుగ దగ్గర పడుతున్నా రేషన్ బియ్యం పోస్తలేరు. ఎన్నిసార్లు డీలర్‌ను అడిగినా ఇంకా బియ్యం రాలేదనే చెబుతున్నడు. గతంలో ప్రతి నెలా మొదటి వారంలోనే బియ్యం వచ్చేది. ఈ నెల సంక్రాంతి పండుగ ఉన్నా వారం దాటినా బియ్యం రాలేదు. గత సర్కారు ఎప్పుడు పండుగొచ్చినా ముందుగానే రేషన్ దుకాణాల్లో సరుకులను అందజేసేది. కొత్తగా ఏర్పడిన సర్కారు బియ్యం సరఫరాను పట్టించుకుంటలేదు. అధికారులు జోక్యం చేసుకొని బియ్యం సరఫరా చేయాలి. *-కాంపెల్లి ఎర్రక్క,మందమర్రి*

మార్పంటే ఇదేనా..

మందమర్రి, జనవరి 10: ఏదో మార్పు వస్తుందని ఓటు వేసి గెలిపిస్తే కొత్త సర్కారు హయాంలో వచ్చిన మార్పు ఇదేనా. సంక్రాంతి పండుగ సమీపిస్తున్న రేషన్ బియ్యం రాలేదు. రోజూ రేషన్ దుకాణానికి వెళ్లి నిరాశతో తిరిగి వస్తున్నం. రేషన్ డీలర్ ఇంకా బియ్యం రాలేదనే సమాధానం తప్ప ఎప్పుడస్తయో చెప్పడం లేదు. కేసీఆర్ ప్రభుత్వం మొదటి వారంలోనే బియ్యం ఇచ్చేది. ఎవరిని అడిగినా సరైన సమాధానం చెప్పడం లేదు. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం నెల రోజుల్లోనే ఇబ్బందులకు గురి చేస్తోంది. అధికారులు పండుగ లోపు రేషన్ బియ్యం వచ్చే విధంగా చూడాలి. *-సీపెల్లి గున్నమ్మ ,మందమర్రి.*

ఏసీబీ వలలో అవినీతి చేపలు

- ఉమ్మడి జిల్లాలో రెండు చోట్ల దాడులు
- కడెంలో తహసీల్దార్, డీటీ
- పట్టా కోసం రైతు నుంచి రూ. 9 వేలు తీసుకుంటుండగా చిక్కిన అధికారులు
- బెల్లంపల్లిలో కాసిపేట పీఆర్ ఏఈ, పంచాయతీ కార్యదర్శి
- కాంట్రాక్టర్‌కు బిల్లుల చెల్లింపునకు రూ. 15వేలు వసూలు

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో రెండు చోట్ల ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. నిర్మల్ జిల్లా కడెం తహసీల్దార్ రాజేశ్వరి, డీటీ చిన్నయ్య రైతు నుంచి రూ. 9 వేలు తీసుకుంటుండగా పట్టుబడ్డారు. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి ఎంపీడీవో కార్యాలయంలో ఓ కాంట్రాక్టర్ నుంచి రూ. 15 వేలు తీసుకుంటూ కాసిపేట పీఆర్ ఏఈ పరంజ్యోతి, పంచాయతీ కార్యదర్శి వీరబాబు అడ్డంగా బుక్కయ్యారు.

పట్టుబడ్డ కడెం తహసీల్దార్ రాజేశ్వరి, పట్టుబడ్డ నగదుతో కాసిపేట పీఆర్ ఏఈ పరంజ్యోతి, పంచాయతీ కార్యదర్శి వీరబాబు

కడెం, జనవరి 10: భూమి పట్టా విషయంలో రైతు నుంచి రూ. 9 వేలు తీసుకుంటూ కడెం రెవెన్యూ అధికారులు ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. ఏసీబీ ఆదిలాబాద్ ఇన్‌చార్జి డీఎస్పీ వీవీ రమణమూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తమద్దిపడగ గ్రామానికి చెందిన లసెట్టి రాజన్న పెద్దనాన్న పేరుమీద ఉన్న 35 గుంటల భూమి పట్టా విషయంలో రెవెన్యూ అధికారులు వేధిస్తున్నారు. సర్వే నంబర్ 376లోని 5 గుంటలు, 373/2/2 లోని 24 గుంటలు, 376/2లోని 6 గుంటల భూమిని తన తమ్ముడు లసెట్టి సురేశ్ పేరిట గిఫ్ట్ రిజిస్ట్రేషన్ చేసేందుకు గత నెల 28న ధరణి ద్వారా స్లాట్ బుక్ చేసుకున్నారు. గిఫ్ట్ భూమిని పట్టా చేయడం సాధ్యం కాదని, మూడు సర్వే నంబర్లకు గానూ ఒక్కో దానికి రూ. 5 వేల చొప్పున మొత్తం రూ. 15 వేలు ఇవ్వాలని లంచం డిమాండ్ చేశారు. ఈ నెల 9 వరకు కూడా తహసీల్ కార్యాలయం చుట్టూ తిరిగినా పని కాలేదు. దీంతో బాధిత రైతు ఈ నెల 9న కరీంనగర్ ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. బుధవారం ఉదయం మళ్లీ పట్టా కోసం కడెం కార్యాలయానికి వెళ్లగా రూ. రూ. 9 వేలు ఇచ్చి పట్టా చేయించుకోమని అధికారులు చెప్పారు. దీంతో రూ. 9 వేలు తహసీల్దార్ రాజేశ్వరి సూచన మేరకు డీటీ చిన్నయ్యకు ఇస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. పట్టుకున్న నగదును స్వాధీనం చేసుకొని తహసీల్దార్, డీటీని కరీంనగర్‌లోని ప్రత్యేక ఏసీబీ కోర్టుకు తరలించారు. అక్కడి నుంచి రిమాండ్‌కు తరలించనున్నట్లు తెలిపారు. అధికారులు అవినీతికి పాల్పడితే ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్ 1064, 91543 88963 సంప్రదించాలని ఆయన సూచించారు. ఏసీబీ ఎస్ఐలు జాన్‌రెడ్డి, రవీందర్, స్థానిక పోలీస్ సిబ్బంది ఉన్నారు.

బెల్లంపల్లిలో..

బెల్లంపల్లిరూరల్, జనవరి 10: బెల్లంపల్లి ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం మధ్యాహ్నం ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో పెర్కపల్లి గ్రామానికి చెందిన కాంట్రాక్టర్ రామగోని అశోక్‌గౌడ్ నుంచి రూ 15 వేలు లంచం తీసుకుంటున్న కాసిపేట పంచాయతీరాజ్ ఇంజనీర్ పోగుల పరంజ్యోతి, పెర్కపల్లి పంచాయతీ కార్యదర్శి కవటం వీరబాబును రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. 15 వేలను వారి వద్ద నుంచి ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. పెర్కపల్లిలో పూర్తి చేసిన తెలంగాణ క్రీడాప్రాంగణానికి సంబంధించిన రూ 1.50 లక్షల మట్టి పనులకు సంబంధించిన బిల్లుల చెల్లింపు కోసం మెజర్‌మెంట్ బుక్ చేయడానికి కాంట్రాక్టర్ నుంచి రూ.15వేలు లంచంగా డిమాండ్ చేశారు. రెండేళ్లుగా బిల్లులు చెల్లించకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారు. దీంతో ఆయన ఏసీబీ అధికారులను సంప్రదించాడు. బుధవారం మధ్యాహ్నం బెల్లంపల్లి ఎంపీడీవో కార్యాలయం వద్ద కాంట్రాక్టర్ అశోక్‌గౌడ్ నుంచి లంచం తీసుకుంటుండగా పంచాయతీరాజ్ ఏఈ పోగుల పరంజ్యోతి, పంచాయతీ కార్యదర్శి కవటం వీరబాబు అడ్డంగా దొరికిపోయారు. వీరి పై అధికారులు కేసు నమోదు చేశారు. అధికారులు లంచం అడిగితే బాధితులు అవినీతి నిరోధకశాఖ (ఏసీబీ)ను ఆశ్రయించాలని ఆదిలాబాద్ ఏసీబీ డీఎస్పీ వై.రమేశ్ కోరారు. ఏసీబీ టోల్‌ఫ్రీ నెంబర్ 1064 కి కాల్ చేయాలని, వెంటనే ఏసీబీ అధికారులు సత్వర న్యాయం అందిస్తారని ఆయన తెలిపారు. ఈ దాడుల్లో ఏసీబీ ఇన్‌స్పెక్టర్లు జే రాము,ఏ.తిరుపతి,సునీల్, తదితరులున్నారు.

మార్లవాయిలో కేసీఆర్ ప్రభుత్వం ప్రత్యేక నిధులతో తీర్చిదిద్దిన హైమన్ డార్ఫ్ నివసించిన ఇల్లు

నేడు డార్ఫ్ దంపతుల వర్ధంతి

- మార్లవాయిలో ప్రత్యేక సభ
- తరలిరానున్న ప్రముఖులు, ఆదివాసులు

జైనూర్, జనవరి 10: జైనూర్ మండలంలోని మార్లవాయిలో ప్రొఫెసర్ హైమన్‌డార్ఫ్, బెట్టి ఎలిజబెత్‌ల 37వ వర్ధంతి గురువారం నిర్వహించనున్నారు. కేసీఆర్ ప్రభుత్వం హయాంలో ఆదివాసుల కోరిక మేరకు మార్లవాయిలో డార్ఫ్ దంపతులు నివసించిన ఇంటిని, సమాధులను కొత్తగా తీర్చిదిద్దింది. నేడు మార్లవాయి గ్రామాన్ని ప్రపంచమంతా చర్చించుకునేలా చేసింది. చరిత్రపుటల్లో మార్లవాయి 1940లో తెలంగాణ ప్రాంతం నైజాం నవాబుల పాలనలో ఉండేది. ఆనాటి వ్యాపారులు, పట్వారీలు, గ్రామ అధికారులు, ఆదివాసులపై దౌర్జన్యాలు సాగిస్తుండేవారు. జమీందారుల పెత్తనం కారణంగా ఆదివాసీల జీవితాలు చిన్నాభిన్నమయ్యాయి. ఈ క్రమంలోనే కెరమెరి మండలంలోని జోడేఘాట్ అటవీ ప్రాంతంలో కుమ్రం భీం ఆధ్వర్యంలో నిజాం సైనికులు, ఆదివాసులకు తీవ్ర పోరాటం జరిగింది. ఈ పోరాటం లో కుమ్రం భీం కన్నుమూశాడు. ఈ తిరుగుబాటుకు కారణాలను పరిశోధించడానికి నాడు దేశంలో రాజ్యమేలుతున్న బ్రిటిష్ ప్రభుత్వం ప్రొఫెసర్ హైమన్‌డార్ఫ్‌ను ఆదిలాబాద్ జిల్లాకు పంపింది. ఆయన తన సతీమణి బెట్టి ఎలిజబెత్‌తో కలిసి మార్లవాయి గ్రామానికి వచ్చి స్థిరపడ్డారు. సుమారు 12 ఏండ్ల పాటు ఆదివాసులతో కలిసి జీవించారు. ఆదివాసీ జీవితాలపై పరిశోధన జరిపారు. ఆదివాసుల అభ్యున్నతికి ఎన్నో సూచనలు చే యడమే కాకుండా, ప్రామాణిక గ్రంథాలను (ది గోండ్స్ ఆఫ్ అదిలాబాద్) రాశారు. జిల్లాలో పలు పాఠశాలలను నెలకొల్పారు. ఉపాధ్యాయ శిక్షణ కేంద్రాలను స్థాపించా రు. ఆదివాసీ సమస్యల పరిష్కారానికి దర్బార్‌ను నిర్వహించారు. రాయి సెంటర్లకు కొత్త ఊపిరి పోశారు. ఇలా ఇక్కడి గిరిజనులతో మమేకమై, వారి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు. ఆ పుణ్య దంపతుల 37వ వర్ధం తి సభను మార్లవాయిలో గురువారం నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఉన్నతాధికారులు, ఆదివాసీ సంఘాల నాయకులు కార్యక్రమానికి హాజరయ్యే అవకాశం ఉంది.

అంధుల కోసం ప్రత్యేక కార్యక్రమాలు

మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్

నస్పూర్, జనవరి 10 : నిరుద్యోగ అంధుల కోసం ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నట్లు మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో జిల్లా స్త్రీ శిశు, దివ్యాంగుల వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో లూయిస్ బ్రెయిలీ 215వ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా సంక్షేమాధికారి చిన్నయ్య, డీఆర్డీవో శేషాద్రితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అంధుల జీవితాల్లో వెలుగులు నింపిన మహనీయుడు లూయిస్ బ్రెయిలీ అని కొనియాడారు. తన బ్యాచ్‌లో అజయ్ అరోరా అనే అంధ ఐఏఎస్ ఉన్నారని గుర్తు చేసుకున్నారు. అనంతరం బ్రెయిలీ క్యాలెండర్ ఆవిష్కరించి కేక్ కట్ చేశారు. అనంతరం అంధులను శాలువాలతో సత్కరించారు. సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఓటుపై చైతన్య కార్యక్రమాలు

ఈ నెల 25వ తేదీన 14వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని అన్ని శాఖలు ప్రజల భాగస్వామ్యంతో ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ బదావత్ సంతోష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓటరు దినోత్సవంలో ఓటు లాంటిది ఇంకొకటి లేదు – నేను ఖచ్చితంగా ఓటు వేస్తాననే నినాదంతో వివిధ కార్యక్రమాల ద్వారా ప్రజలను చైతన్య పర్చడం జరుగుతుందని తెలిపారు. పోస్టర్లు, బ్యానర్ల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహిస్తామన్నారు. జిల్లాలో ఈ నెల 25న నిర్వహించనున్న జాతీయ ఓటరు దినోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు.

యువతను ప్రోత్సహించాలి

సీసీసీ నస్పూర్, జనవరి 10: ఆర్థికంగా అభివృద్ధి చెందేలా నిరుద్యోగ యువతను ప్రోత్సహిండంతో పాటు జిల్లా పరిశ్రమ అభివృద్ధికి సహకరించాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలో బుధవారం ఏర్పాటు చేసిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు నూతన శాఖను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో నిరుద్యోగ యువత, పారిశ్రామికరంగాన్ని ప్రోత్సహిస్తూ జిల్లా అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. బ్యాంక్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ మహేశ్ నాయుడు, వైస్ ప్రెసిడెంట్ నాగేశ్వర్‌రావు, శాఖ మేనేజర్ ఒమర్ ఫారూఖ్, తదితరులు పాల్గొన్నారు.

అంధులను సన్మానిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్